
సాక్షి
గుంటూరు
మంగళవారం । 17 । డిసెంబర్ । 2024



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 579.80 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 7,096 క్యూసెక్కులు విడుదలవుతోంది.



వైభవంగా కల్యాణం

నగరంపాలెం: స్థానిక బ్రాడీపేట 2/7వ అడ్డ రోడ్డులోని శ్రీ గౌరీవిశ్వేశ్వరాలయంలో స్వామి వారి జన్మనక్షత్రం సందర్భంగా సోమవారం కల్యాణం నిర్వహించారు.

ఆరుద్రాభిషేకాలు



రేపల్లె రూరల్: ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని ఇసుకపల్లిలోని చెన్నమల్లేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఆరుద్రాభిషేకాలు నిర్వహించారు. భక్తులు మొక్కుబడులు చెల్లించుకున్నారు.

న్యూస్‌రీల్

ఇంధన పొదుపు సామాజిక బాధ్యత

జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి



గుంటూరు వెస్ట్: సంప్రదాయ ఇంధన వనరులతో పాటు విద్యుత్‌ను ఆదా చేయడం సామాజిక బాధ్యతని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు–2024లో భాగంగా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ, డీఆర్వో ఖాజావలి, ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్లు ఎం.గంగరాజు, లక్ష్మీకుమారి, ఎస్ఈ ఆపరేషన్స్ అధికారి మూర్తి, జిల్లా అధికారులు ప్రత్యేక పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ 20వ తేదీ వరకు వారోత్సవాలు జరుగుతాయని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పాటు యువతకు కూడా పెద్దఎత్తున విద్యుత్ ఆదాపై అవగాహన కల్పించాలని ఆమె ఆదేశించారు.

నేడు, రేపు పాలిటెక్నిక్ కళాశాలలో క్రీడా పోటీలు

గుంటూరు రూరల్: మండలంలోని నల్లపాడు ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రెండు రోజుల పాటు ఐపీఎస్‌జీఎం–2024 పేరిట నిర్వహించనున్న క్రీడా పోటీలను మంగళవారం ప్రారంభించనున్నట్లు ప్రిన్సిపాల్ టి.శేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలకు చెందిన 513 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. ప్రారంభోత్సవంలో సీఐడీ డీఎస్పీ గోలి లక్ష్మయ్య, విద్యాశాఖ అధికారి సి.వి. రేణుక, పీవీఆర్ చలపతి మెటల్ ఇండస్ట్రీస్ మేనేజింగ్ డైరెక్టర్ పిల్లా వెంకటేశ్వరరావు, క్రీడల అభివృద్ధి అధికారి పి. నరసింహారెడ్డి తదితరులు పాల్గొంటారని ఆయన తెలిపారు. ఎస్‌బీటీఈటీ రీజినల్ జాయింట్ డైరెక్టర్ నిర్మల్ కుమార్ ప్రియ పర్యవేక్షణలో పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పోటీల అనంతరం విజేతలకు బహుమతి ప్రదానం చేయనున్నట్లు ఆయన తెలిపారు.

ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభం



మంగళగిరి: నగర పరిధిలోని ఆత్మకూరు బాపూజీ విద్యాలయంలో సోమవారం రాత్రి ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. త్రిదిండి చిన్న జీయర్ స్వామి ప్రారంభించారు. తొలి రోజు ధనుర్మాస విశిష్టతను, గోదా అమ్మవారు వ్రత మహోత్సవాలను ఎలా నిర్వహించారనే వివరాలను తెలియజేశారు. భక్తులకు సందేశాన్ని అందించారు. కార్యక్రమంలో పలువురు స్వామీజీలు పాల్గొన్నారు.

యూట్యూబ్‌లో గణిత ప్రశ్నపత్రం

గుంటూరు ఎడ్యుకేషన్: గణితశాస్త్ర యూట్యూబ్‌లో ప్రత్యక్షం కావడం విద్యాశాఖను ఉలికిపాటుకు గురి చేసింది. జిల్లాలోని ఉన్నత పాఠశాలల్లో ఆరో తరగతి నుంచి టెన్త్ విద్యార్థులకు నిర్వహిస్తున్న సమ్మెటివ్ అసెస్‌మెంట్ (ఎస్ఏ–1) పరీక్షల షెడ్యూల్ ప్రకారం సోమవారం గణితశాస్త్ర పరీక్ష జరగాల్సి ఉంది. ప్రశ్నపత్రాలను స్కూల్ కాంప్లెక్స్‌ల నుంచి ప్రతి రోజూ పరీక్ష సమయానికి గంట ముందుగా సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తీసుకెళ్లే విధంగా ఏర్పాటు చేశారు. సోమవారం ఉదయం 9.30 గంటలకు 6,8,10 తరగతుల విద్యార్థులకు పరీక్ష నిర్వహించేందుకు జిల్లావ్యాప్తంగా ఏర్పాట్లు చేశారు. ఉదయం 9.15 గంటలకు గణితం పరీక్షను రద్దు చేస్తున్నట్లు ఉన్నతాధికారుల నుంచి వాట్సాప్, టెలీగ్రామ్ ద్వారా సందేశాలు అందాయి. ప్రశ్నపత్రం యూట్యూబ్‌లో ప్రత్యక్షం కావడంతో పరీక్షను రద్దు చేస్తున్నట్లు ఉన్నతాధికారుల ఆదేశాలతో స్పందించిన జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక తక్షణమే ఎంఈవోలు, హెచ్‌ఎంలకు సమాచారాన్ని పంపారు. ఉదయం జరగాల్సిన పరీక్షతో పాటు మధ్యాహ్నం 7, 9వ తరగతుల విద్యార్థులకు మాథ్స్ పరీక్షను సైతం రద్దు చేశారు. గణితశాస్త్ర పరీక్షను ఎస్సీఈఆర్టీ ద్వారా పంపే మరొక ప్రశ్నపత్రంతో ఈనెల 20న నిర్వహిస్తామని డీఈవో రేణుక చెప్పారు. ప్రశ్నపత్రం యూట్యూబ్‌లో ప్రత్యక్షం కావడంతో గుంటూరు జిల్లాలోని స్కూల్ కాంప్లెక్స్‌లలో ఉంచిన ప్రశ్నపత్రాల బండిళ్లను హడావుడిగా ఆయా ప్రాంతాల్లోని పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ప్రతి రోజూ పోలీస్ స్టేషన్ల నుంచే ప్రశ్నపత్రాలను తీసుకెళ్లాలని హెచ్‌ఎంలకు సూచించారు.

అక్రమాల్లో ‘ట్రాక్’ రికార్డు

- గుంటూరు నగర పాలక సంస్థలో టౌన్‌ప్లానింగ్ తీరు ఇది
- ఎన్‌ఓసీలు పేరిట బిల్డర్లను బెదిరిస్తున్న ఆ విభాగం అధికారులు
- రైల్వే లైన్ వెంట 70కి పైగా వివిధ ఫ్లోర్ల భవనాలు
- నిరభ్యంతర పత్రాలు ఉన్నవి అయిదారే అంటున్న రైల్వే శాఖ
- కొంత మంది బిల్డర్లే లక్ష్యంగా కార్పొరేషన్ నోటీసులు
- వివాదాస్పదం అవుతున్న టౌన్ ప్లానింగ్ చర్యలు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: గుంటూరు నగరపాలక సంస్థలో టౌన్ ప్లానింగ్ లీలలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. తమకు నచ్చని బిల్డర్లను ఎన్‌ఓసీ (నో అబ్జక్షన్ సర్టిఫికెట్)ల పేరుతో వేధించడం తాజాగా చర్చనీయాంశంగా మారింది. బిల్డర్లు వివిధ ఫ్లోర్లు కలిగిన భవనాలు, కమర్షియల్ కాంప్లెక్స్‌లు నిర్మించేటప్పుడు అగ్నిమాపక, పర్యావరణ శాఖల నుంచి నిరభ్యంతర పత్రాలు(ఎన్‌ఓసీ) తీసుకుని టౌన్ ప్లానింగ్‌కు సమర్పించాలి. వీటితోపాటు యాజమాన్య హక్కు పత్రం, లింక్ పత్రాలు, ఎన్‌కంబెన్సీ సర్టిఫికెట్ (ఈసీ), స్ట్రక్చరల్ స్థిరత్వం నివేదిక, సర్టిఫైడ్ స్ట్రక్చరల్ డ్రాయింగ్, బీమా పాలసీ డాక్యుమెంట్లు అందజేయాలి. ఇక రైల్వే లైన్ పక్కన వివిధ ఫ్లోర్లు కలిగిన భవనాలు నిర్మిస్తుంటే ఆ శాఖ నుంచి కూడా ఎన్‌ఓసీ తెచ్చుకోవాలి. భవనం పూర్తయ్యి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఓసీ) కోసం దరఖాస్తు చేసుకునే సమయంలో పైన పేర్కొన్న ఆయా విభాగాల నుంచి నిరభ్యంతర (ఎన్‌ఓసీ) పత్రాలు అందజేయాలి. అయితే, టౌన్ ప్లానింగ్ అధికారులు దీనికి భిన్నంగా ఎన్‌ఓసీలు ముందుగానే అందజేయాలని ఒత్తిడి చేయడంతో పాటు తమకు అనుకూలంగా లేని బిల్డర్లను వేధించడం ప్రారంభించారు.



గుంటూరు నగరంలో రైల్వే లైన్ పక్కన నిర్మించిన భవనాలు

రైల్వేలైన్ పక్కన నిర్మించాలంటే...

నగరపాలక సంస్థ పరిధిలో రైల్వే లైన్ పక్కన భవన నిర్మాణాలు జరిపే విషయంలో కూడా కొన్ని నిబంధనలు పాటించాలి. రైల్వే లైన్ పక్కన వివిధ ఫ్లోర్లు కలిగిన భవనాలు నిర్మించాలంటే ఆ శాఖ నుంచి కూడా ఎన్‌ఓసీ తీసుకోవాల్సి ఉంటుంది. అయితే, రైల్వే ఎన్‌ఓసీ గురించి పలువురు బిల్డర్లు పట్టించుకోవడం లేదు. దీనికి కొన్ని భవనాలను పరిశీలిస్తే ..... నెహ్రూనగర్ నుంచి నగర శివారు వరకు రైల్వే లైన్ పక్కన సుమారు 75 నుంచి 80 వరకు వివిధ ఫ్లోర్లు కలిగిన భవనాలు ఉన్నాయి. ఇవన్నీ ఆక్యుపెన్సీ సమయంలో రైల్వే శాఖ నుంచి ఎన్‌ఓసీ తీసుకుని టౌన్ ప్లానింగ్‌కు సమర్పించాలి. ఆ తర్వాతనే బిల్డర్లకు టౌన్ ప్లానింగ్ అధికారులు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ఇవ్వాలి. అయితే, మామూళ్ల మత్తులో మునిగితేలే టౌన్ ప్లానింగ్‌కు ఇవేమీ పట్టడం లేదు.



రైల్వే ట్రాక్ పక్కన వెలసిన భారీ భవనాలు

బెదిరిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు

ఇక గుంటూరు నగరంలో రైల్వే శాఖ నుంచి ఎన్‌ఓసీ తీసుకున్న భవనాలు, అపార్టుమెంట్లు ఐదారు మించి ఉండవని రైల్వే అధికారులే చెబుతుండడం ఇక్కడ పరిగణనలోకి తీసుకోవాల్సిన అంశం. అంతే కాదు బిల్డర్లు తమ వద్దకు వచ్చి దరఖాస్తు చేసుకుంటేనే ఎన్‌ఓసీ గురించి తాము పరిశీలిస్తామని కూడా వారే చెబుతున్నారు. రైల్వే అధికారుల మాటలను పరిగణలోకి తీసుకోవాల్సిన టౌన్‌ప్లానింగ్ అధికారులు మాత్రం ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తూ మామూళ్ల దందా చేస్తున్నారు. మరో వైపు తమకు నచ్చని బిల్డర్లను మాత్రం రైల్వే ఎన్‌ఓసీ ఉంటేనే వివిధ ఫ్లోర్లు కలిగిన భవనాలు, అపార్టుమెంట్లు కట్టనిస్తామని, లేకపోతే ప్లాన్ రద్దు చేస్తామంటూ బెదిరింపులకు దిగడం నగరంలో చర్చనీయాంశమైంది.

అనుమానాలకు అవకాశం

నగరంలో ఇప్పటికే 1187 భవనాలు షార్ట్‌ఫాల్‌లో ఉన్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ నిర్ధారించారు. ఈ భవనాలకు పైన పేర్కొన్న ఎన్‌ఓసీలు లేనప్పటికీ కొద్దిమంది బిల్డర్లకు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు ఇచ్చేశారు. మరికొందరిని ఎన్‌ఓసీల కోసం టౌన్‌ప్లానింగ్ అధికారులు ఒత్తిడి చేయడం వెనుక అధికార పార్టీ నేతల ప్రమేయం ఉన్నట్టు అవగతమవుతోంది. షార్ట్‌ఫాల్స్‌కు సంబంధించి అధికార పార్టీ నాయకులు, పలుకుబడి ఉన్న వారి భవనాల వైపు తొంగి చూడకపోవడం ఇందుకు బలం చేకూరుస్తోంది. అదే అధికార పార్టీకి నచ్చని బిల్డర్ల భవనాలను అక్రమాలుగా నిర్ణయి స్తున్నారు. అధికార పార్టీకి చెందిన బిల్డర్ల అక్రమాలు కళ్ల ముందు కనిపిస్తున్నా చర్యలు శూన్యం. ఈ తరహా అక్రమాలతో టౌన్‌ప్లానింగ్ విభాగం పెద్ద ఎత్తున ‘మూటలు’ కట్టుకుంటున్నా.. మున్సిపల్ కమిషనర్ సమీక్ష చేయకపోవడం విడ్డూరం

ఎయిమ్స్ స్నాతకోత్సవ ఏర్పాట్ల పరిశీలన



మంగళగిరి: పట్టణంలోని అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ(ఎయిమ్స్)లో మంగళవారం జరగనున్న ప్రథమ స్నాతకోత్సవ ఏర్పాట్లను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని కలెక్టర్ జి.నాగలక్ష్మి అధికారులకు సూచించారు. సోమవారం ఆమె ఏర్పాట్లను ఎయిమ్స్ డైరెక్టర్ డాక్టర్ మాదభనందకర్, జిల్లా సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ తేజ, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సిన్హా, అసిస్టెంట్ కలెక్టర్ పవర్ స్వప్నిల్ జగన్నాథ్‌లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడులతో పాటు పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొంటున్న నేపథ్యంలో భద్రత, పార్కింగ్ ఏర్పాట్లను అధికారులు సమన్వయంతో చేయాలని సూచించారు.

శ్రీరామ కోటి ఉత్సవాలు ప్రారంభం

నగరంపాలెం: స్థానిక సంపత్‌నగర్‌లోని శ్రీరామ నామ క్షేత్రంలో 98వ శ్రీరామ కోటి మహోత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. సోమవారం సాయంత్రం అంకురారోపణ పూజ, అఖండ జ్యోతి స్థాపన చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీ ధనకుదరం సీతారామానుజాచార్యులు శ్రీరామ పతాకావిష్కరణ చేసి ఉత్సవాలను ప్రారంభించారు. శ్రీసీతారామ పరివార సేవ అత్యంత విశేషమని భక్తులకు తెలియజేశారు. ఏర్పాట్లను శ్రీ శృంగేరి పీఠపాలిత శ్రీ సీతారామ సంకీర్తన సంఘం, శ్రీరామ నామ క్షేత్రం కార్య నిర్వాహకులు రాగం వెంకట లీలాసుందరి, మస్తాన్‌రావు దంపతులు, క్షేత్ర పాలకమండలి సభ్యులు పర్యవేక్షించారు.

అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: సమస్యలపై ప్రజల నుంచి అందే అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రజలకు తమ సమస్యల పరిష్కారం కోసం అర్జీ పెట్టుకునే హక్కు ఉంటుందని, వాటిని సక్రమంగా పరిష్కరించాల్సిన బాధ్యత మనపై ఉంటుందని తెలిపారు. కొందరు తూతూమంత్రంగా, మరికొందరు అర్జీదారులను తప్పుదోవ కూడా పట్టించి క్లోజ్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తన వద్ద వివరాలున్నాయని పేర్కొన్నారు. జిల్లా అధికారులంతా ఒకే చోటికి చేరి ప్రజల సమస్యలు పరిష్కరించడానికి నిర్వహిస్తున్న ఇంతటి కార్యక్రమాన్ని అర్థం చేసుకోవాలని ఆమె కోరారు. ప్రజలు తమ అర్జీలను స్థానికంగా ఉండే మండల, డివిజనల్, మున్సిపల్ స్థాయి అధికారులకు ప్రతి వారం ఇవ్వొచ్చని, దీంతో సమస్యలు అక్కడే పరిష్కారమవుతాయని తెలిపారు. అనంతరం వచ్చిన 162 అర్జీలను కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ, డీఆర్వో ఖాజావలి, ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం.గంగరాజు, లక్ష్మీ కుమారి, జిల్లా అధికారులు పరిశీలించారు.




దివ్యాంగుల సమస్య వింటున్న జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి

ఏడీ సువార్తపై కలెక్టర్‌కు ఫిర్యాదు

అక్కడికక్కడే విచారణకు ఆదేశం

గుంటూరు వెస్ట్ : ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన కొందరు దివ్యాంగులు దివ్యాంగుల, వయో వృద్ధుల, హిజ్రాల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సువార్తపై సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ సమావేశ మందిరం బయటకు వచ్చి దివ్యాంగులతో మాట్లాడారు. వివరాలు.. స్థానిక బృందావన్ గార్డెన్స్‌లో అంధుల పాఠశాల ఉంది. దాన్లో తమకు కూడా హక్కు ఉందని దివ్యాంగులు వాదిస్తున్నారు. ఆ స్థలంలో ఒక ఎకరా కేటాయిస్తే ఎంపీ నిధులతో ఉపాధి కోసం భవన సముదాయాలు నిర్మించుకుంటామని తెలిపారు. అయితే, దీనికి ఏడీ సువార్త అడ్డం పడుతున్నారని, తమ పట్ల దౌర్జన్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. 2016 దివ్యాంగుల హక్కుల చట్టాన్ని పూర్తిగా నీరుగారుస్తున్నారని తెలిపారు. తమకు అన్యాయం చేస్తున్న సువార్తపై శాఖాపరమైన విచారణ జరిపించాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. సువార్తపై విచారణకు కలెక్టర్ అక్కడిక్కడే ఆదేశించారు. దివ్యాంగులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.


రోడ్డుపైనే జీవనం.. కనికరించండి !



తాడేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ప్యారీ కంపెనీ వద్ద గత 60 ఏళ్ల నుంచి నివాసముంటున్నాం. 2009లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రత్యామ్నాయంగా స్థలాలు ఇస్తాం ఖాళీ చేయమంటే చేశాం. ఇప్పటి వరకు ఒక్క సెంటు కూడా ఇవ్వలేదు. సుమారు వంద కుటుంబాలు రోడ్డుపైనా జీవనం సాగిస్తున్న పరిస్థితి. అధికారులు ఆదుకోవాలి.

–బాధితులు, తాడేపల్లి


స్పీడ్ బ్రేకర్లతో అవస్థలు



గుంటూరు పట్టణంలోని విద్యానగర్, లక్ష్మీపురం, అమరావతి రోడ్లపైన ఇటీవల స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. ఇవి మూడు వరుసలు ఉండటంతో వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఒక్క స్పీడ్ బ్రేకర్ వేస్తే సరిపోయేదానికి అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించారు. సమస్య పరిష్కరించాలని మనవి.

–బండ్లమూడి సుబ్బయ్య, ఇంటర్నేషనల్ సైక్లిస్ట్, గుంటూరు.

మాజీ ఎమ్మెల్యే రోశయ్య మనుషులు ఇబ్బంది పెడుతున్నారు



నేను 2022లో కేశినేని పద్మావతి, పాండురంగావు దంపతుల నుంచి పొన్నూరులో 19.22 లక్షల విలువైన స్థలాన్ని కొనుగోలు చేసాను. విజయవాడలో డాక్యుమెంట్ నంబర్ 7603/2022 గా రిజిస్ట్రేషన్ కూడా అయ్యింది. ఇప్పుడు పొన్నూరు మాజీ ఎమ్మెల్యే రోశయ్య మనుషులు ఇబ్బంది పెడుతున్నారు. నా ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించారు. స్థానిక తహసీల్దార్‌తో కలిసి వేరే దస్తావేజులు పుట్టించి మరొకరికి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించడమే కాకుండా నాపై క్రిమినల్ కేసులు నమోదు చేయించారు. నాకు న్యాయం చేయండి.

–షేక్ వాహిదుల్లా, పొన్నూరు.

కూటమిలో ‘చాంబర్’ వార్

- పోటీలో ఇద్దరు పచ్చ నేతలు
- ఏకగ్రీవం కోసం కూటమి నేతల తంటాలు
- రేపటి నుంచి నామినేషన్ల స్వీకరణ
- 28న ఎన్నికలు

నగరంపాలెం: ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ (ఐసీసీ) ఎన్నికలు ఈసారి రసకందాయంలో పడ్డాయి. ఏకగ్రీవం కోసం కూటమి నేతల తంటాలు పడుతున్నా, అధ్యక్ష స్థానం కోసం ఇద్దరు టీడీపీ నేతలు పావులు కదుపుతున్నారు. ఎన్నికల ముందు, తర్వాత టీడీపీలో చేరిన యేల్చూరి వెంకటేశ్వర్లు, రంగా బాలకృష్ణ అధ్యక్ష పదవి కోసం పోటీపడుతున్నారు. ఇటీవల కొత్తపేటలోని ఓ కల్యాణ మండపంలో నిర్వహించిన సమావేశంలోనూ అధ్యక్ష పదవికి అవకాశం ఇవ్వాలని వ్యాపార వర్గాలను, కూటమి నాయకులను బాలకృష్ణ అభ్యర్థించారు. మరోవైపు యేల్చూరిని ఏకగ్రీవంగా చేసేందుకు నేతలు మంతనాలు చేస్తున్నారు. ఒకవేళ ఏకగ్రీవానికి ఆమోదం లభించకపోతే, అధిక ఓట్ల మెజార్టీతో ఆయన్ను గెలిపించేందుకు పావులు కదుపుతున్నారు. అయితే, బరిలో ఉన్న అభ్యర్థులు గెలుపు కోసం నానా తంటాలు పడుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని ఓటర్ల జాబితాలోని వారితో సెల్ ఫోన్లల్లో మాట్లాడుతున్నారు. దగ్గరలో ఉన్న వారి వద్దకు నేరుగా వెళ్లి సంప్రదింపులు చేస్తున్నారు. ఎవరికి వారు ఈసారి ఎన్నికల్లో తమ అభ్యర్థిత్వానికి మద్దతుగా ఓటేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

చాంబర్‌కు సుదీర్ఘ చరిత్ర

గుంటూరు జిన్నాటవర్ సెంటర్‌లోని ఇండియా చాంబర్ ఆఫ్ కామర్స్ (ఐసీసీ) ప్రధాన కార్యాలయం 1941లో ఏర్పాటైంది. ఏర్పాటైన తొలినాళ్లల్లో సుమారు 900 మంది వ్యాపారులకు సభ్యత్వం ఉండేది. కాలక్రమేణా ఆ సంఖ్య సుమారు 3,200 చేరింది. వ్యాపారాలు చేసే అన్నివర్గాలు చాంబర్‌లో ఉన్నారు. రూ.3 వేల (జీవితకాలం) సభ్యత్వం, రూ.8 వేల మహారాజ పోషక (జీవిత కాలం) సభ్యత్వాలు ఉన్నాయి. వ్యాపారులకు మేలు చేయాలనే లక్ష్యంతో చాంబర్‌ను నెలకొల్పారు. అందుకు అనుగుణంగానే కార్యవర్గాన్ని కూడా ఎన్నుకునేవారు. గతంలో పన్నెండున్నరేళ్లు దివంగత ఎంపీ మద్ది సుదర్శన్ అధ్యక్షునిగా పనిచేశారు. ఆ తర్వాత 34 ఏళ్ల పాటు చాంబర్ అధ్యక్షునిగా ఆతుకూరి ఆంజనేయులు పదవీ బాధ్యతలు నిర్వహించారు. చాలా సార్లు ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గత రికార్డులను చెరిపేశారు. వ్యాపార వర్గాలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు పరిష్కార మార్గం చూపారు. విపత్కర పరిస్థితులు తలెత్తినప్పుడు చాంబర్ నుంచి భారీగా సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అయితే, ఈనెల 28న జరగనున్న ఎన్నికలకు ఆయన దూరంగా ఉంటున్నారు. కొత్త వారికి అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో పోటీ నుంచి వైదొలగినట్లు ఆంజనేయులు తెలిపారు. ఈ క్రమంలో ఆయనకు గౌరవ అధ్యక్ష పదవి కేటాయించనున్నారు.

ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ లోగో

కార్యాలయం ఆధునికీకరణ

చాంబర్ భవనంలో ప్రస్తుతం కొనసాగుతున్న కార్యాలయాన్ని పైకి తరలించారు. ఈనెల 15న ప్రస్తుత అధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు దీన్ని ప్రారంభించారు. గౌరవ అధ్యక్షుడు, అధ్యక్షులకు ప్రత్యేక చాంబర్‌లతో పాటు సమావేశాలకు అనువుగా ఉండేలా తీర్చిదిద్దారు.

నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు

ఎన్నికల నామినేషన్ల పక్రియ ఈనెల 18 నుంచి మొదలవుతుంది. 25న ఎవరెవరూ బరిలో ఉన్నారనే దానిపై ఒక స్పష్టత వస్తోంది. 28న జిన్నా టవర్ కూడలిలోని చాంబర్ ప్రధాన కార్యాలయంలో ఉదయం 8.30 గంటలకు ఓట్ల నమోదు పక్రియ మొదలై, సాయంత్రం 5 గంటలకు ముగియనుంది. సాయంత్రం నుంచి ఓట్లను లెక్కించి నూతన అధ్యక్షుడ్ని ప్రకటించనున్నారు.

పండుగలా వై.ఎస్.జగన్ జన్మదినోత్సవం

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు
- 21న ఘనంగా నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, జిల్లా అధ్యక్షులు అంబటి రాంబాబు. వేదికపై గుంటూరు, నరసరావుపేట పార్లమెంట్ జిల్లాల పరిశీలకులు మోదుగుల వేణుగోపాలరెడ్డి తదితరులు

పట్నంబజారు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం అంటే పార్టీ నేతలు, కార్యకర్తలు, ప్రజలకు పండుగలాంటిందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు చెప్పారు. ఈనెల 21న వేడుకలకు సంబంధించి నిర్వహించతలపెట్టిన కార్యక్రమాల గురించి సోమవారం బృందావన్ గార్డెన్స్‌లోని పార్టీ కార్యాలయంలో ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. 21న పార్టీ జిల్లా కార్యాలయంలో కేక్ కటింగ్, రక్తదాన శిబిరంతో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు తీర్మానించారు. ఈ సందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా కార్యకర్తలు, యువత పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

- గుంటూరు, నరసరావుపేట పార్లమెంట్ జిల్లాల పరిశీలకులు మోదుగుల వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ పేదవారి గుండె చప్పుడు అయిన వై.ఎస్.జగన్ జన్మదినాన్ని ఘనంగా నిర్వహించాలని తెలిపారు.
- పార్టీ నగర అధ్యక్షులు, డెప్యూటీ మేయర్, తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు (డైమండ్‌బాబు) మాట్లాడుతూ వై.ఎస్.జగన్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించడంతోపాటు, పేద వర్గాలకు మేలు జరిగేలా పలు సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.
- తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా మాట్లాడుతూ వై.ఎస్.జగనన్న జన్మదినాన్ని పురస్కరించుకుని కార్యకర్తలకు మేలు జరిగేలా పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు నిమ్మకాయల రాజనారాయణ, మెట్టు వెంకటప్పారెడ్డి, బత్తుల దేవానందం, మండేపూడి పురుషోత్తం, పఠాన్ ముంతాజ్, అంగడి శ్రీనివాసరావు, బైరెడ్డి రవీంద్రారెడ్డి, కార్పొరేటర్లు ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి), రామనబోయిన అజయ్‌యాదవ్, రోషన్, అగ్గిపెట్టె రాజు, పార్టీ నేతలు ఏటుకూరి విజయసారథి, పచ్చల ఆనంద్, నందేటి రాజేష్, బైరెడ్డి రవీంద్రారెడ్డి, మేడా సాంబశివరావు, సురేష్ పాల్గొన్నారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా
తెనాలి మార్కెట్‌యార్డులో
సోమవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **2,500**
గరిష్ఠం : రూ. **3,500**
మోడల్ ధర రూ. **3,000**

క్లుప్తంగా

ట్రాన్స్‌ఫార్మర్ల దొంగలు అరెస్ట్

వినుకొండ(నూజెండ్ల): పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లను దొంగతనం చేస్తున్న దొంగలను అరెస్ట్ చేసినట్లు నరసరావుపేట డీఎస్పీ కె.నాగేశ్వరరావు తెలిపారు. పట్టణంలోని ఐనవోలు పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు సిబ్బంది సాయంతో దొంగలను పట్టుకున్నామన్నారు. ప్రకాశం జిల్లా దోర్నాల మండలం అసనపాలెంకు చెందిన నల్లబోతుల పెద్ద యంగయ్య, పల్నాడు జిల్లా నూజెండ్ల మండలం పెద్దవరం గ్రామానికి చెందిన బత్తుల కోటయ్య, తురిమెల్ల గ్రామానికి చెందిన తోలుసురి లక్ష్మీనారాయణ, వినుకొండ మండలం గాంధీనగర్‌కు చెందిన వీరబోయిన బాలయ్య ఏడాదిగా పల్నాడు జిల్లా, ప్రకాశం జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్‌వైర్ దొంగతనాలకు పాల్పడుతున్నారు. వీరు ఐనవోలు పోలీస్ స్టేషన్ పరిధిలోనే కాకుండా పల్నాడు జిల్లాలోని శావల్యాపురం, బండ్లమోటు, వినుకొండ, నకరికల్లు, మాచర్ల టౌన్, రొంపిచర్ల, ప్రకాశం జిల్లాలోని దొనకొండ, త్రిపురాంతకం పోలీస్‌స్టేషన్ల పరిధిలో దొంగతనాలకు పాల్పడినట్లు మొత్తం 27 కేసులు ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు. వీరిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి సుమారు రూ.3.50లక్షల విలువైన 350 కేజీల కాపర్‌వైర్‌ను స్వాధీనపరచుకున్నట్లు వెల్లడించారు. విలేకరుల సమావేశంలో వినుకొండ రూరల్ సీఐ బి.ప్రభాకర్, ఐనవోలు ఎస్ఐ బీవీ కృష్ణారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగాలు ఇప్పిస్తా‘మనీ’ మోసం

- ప్రజా ఫిర్యాదులు పరిష్కార వేదికలో బాధితుల ఆవేదన
- సమస్యలను పరిష్కరించాలని అధికారులకు ఏఎస్పీ కె.సుప్రజ ఆదేశం

నగరంపాలెం: ఉద్యోగాల పేర్లతో పలువురు మోసగించారంటూ బాధితులు వాపోయారు. ఫేక్ కాల్ లెటర్స్‌తో పాటు ఉత్తుత్తి శిక్షణ కార్యక్రమాల పేరుతో జీతాల్లేకుండా చేశారంటూ ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో సోమవారం ప్రజా ఫిర్యాదులు పరిష్కార వేదిక నిర్వహించారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు జిల్లా ఏఎస్పీ (క్రైం) కె.సుప్రజ అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. వారి బాధలను ఆలకించారు. బాధితులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని సూచించారు. తూర్పు, పశ్చిమ డీఎస్పీలు అబ్దుల్ అజీజ్, జయరాం ప్రసాద్‌లు కూడా అర్జీలు స్వీకరించారు.


బాధితురాలి సమస్య ఆలకిస్తున్న జిల్లా ఏఎస్పీ సుప్రజ

ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం పేరిట డబ్బులు వసూలు

తెలిసిన వ్యక్తి ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పగా, 2019 నుంచి దఫాల వారీగా ఓ వ్యక్తికి రూ.3.70 లక్షలు చెల్లించాను. ఉద్యోగం ఇప్పించకపోవడంతో తిరిగి రూ.50వేలు చెల్లించారు. మిగతా డబ్బులు ఇవ్వడం లేదు. మొబైల్ ఫోన్ లిఫ్ట్ చేయడంలేదు. తాడికొండ బండారుపల్లి గ్రామంలో ఉంటున్న అతని తల్లిదండ్రులను అడిగినా ప్రయోజనం లేదు. మిగతా రూ.3.20 లక్షలు ఇప్పించాలని కోరుతున్నా.

– ఓ.సాయికృష్ణ, అంగలకుదురు, తెనాలి

ఆస్ట్రేలియాకు పంపిస్తానని మోసం

ఉన్నత చదువుల నిమిత్తం ఆస్ట్రేలియా వెళ్లాలనుకున్నా. ఈ క్రమంలో ఊర్లో తెలిసిన ఓ వ్యక్తి పరిచయమయ్యాడు. గతంలో చాలా మందిని విదేశాలకు పంపించానని, కళాశాలలు, విశ్వ విద్యాలయాలు బాగా తెలుసునని నమ్మబలికాడు. ఓ కళాశాలలో సీటు ఇప్పిస్తానని రూ.5.50 లక్షలు తీసుకున్నాడు. నకిలీ కాల్‌లెటర్లు చూపించి, ఇంకా డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేసేవాడు. ఉద్యోగం ఇప్పించకపోవడంతో డబ్బులు ఇవ్వాలని అడిగితే ఇష్టానుసారంగా మాట్లాడుతున్నాడు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే అంతుచూస్తానని బెదిరిస్తున్నాడు. కొందరు మహిళలను ఆసరాగా చేసుకుని నగదు వసూలు చేస్తున్నారు. డబ్బులు చెల్లించకపోగా చంపుతానని బెదిరిస్తున్నారు. న్యాయం చేయగలరు.

– వై.హోసన్నా స్టీఫెన్, నల్లపాడు

పోలీసులు స్పందించడం లేదు

సుమారు పదేళ్ల క్రితం ఓ వ్యక్తి పరిచయమయ్యారు. మార్కాపురానికి చెందిన మరో వ్యక్తి ద్వారా ఉద్యోగం ఇప్పిస్తానని ఈ ఏడాది జూన్‌లో రూ.2 లక్షలు తీసుకున్నాడు. నెలలు గడిచినా ఇప్పించలేదు. డబ్బులు తిరిగి ఇవ్వాలని అడిగితే సమాధానం లేదు. నల్లపాడు పోలీసులు, జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడంలేదు. అదేమని అడిగితే రాష్ట్ర మంత్రి లోకేష్ వద్ద ఉంటానని బెదిరింపులకు పాల్పడుతున్నాడు. న్యాయం చేయగలరు.

– జి.వెంకటేశ్వరరావు, ఎస్ఎల్ఆర్ నగర్, నల్లకుంట

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం పేరుతో మోసం

నాజ్ కూడలిలోని ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో పనిచేసే ఆమె పరిచయమైంది. ప్రభుత్వం తరఫున అవుట్ సోర్సింగ్ ఉద్యోగం ఇప్పిస్తానని తెలిపింది. దీంతో గతేడాది ఏప్రిల్‌లో రూ.4 లక్షలు ఆమెతో భర్తకు చెల్లించా. దీంతో తెనాలి రెవిన్యూ విభాగంలో ఆటెండర్‌గా పర్మినెంట్ ఉద్యోగం ఉందని మరో లక్ష తీసుకున్నారు. అనంతరం కృష్ణా జిల్లా ఆవురిపూడి సచివాలయం పరిధిలో రీసర్వే పనులు చేయించారు. నెలల తరబడిగా పని చేసినా జీతాల్లేవు. గతంలో చెల్లించిన రూ.5 లక్షలు చెల్లించాలని అడిగితే విజయవాడలోని రాజరాజేశ్వరిపేట అప్పర్ ప్రైమరి పాఠశాలలో పిల్లలకు పాఠాలు చెప్పించారు. అక్కడ కూడా జీతం చెల్లించకపోవడంతో గట్టిగా అడిగాను. త్వరలో పౌరసరఫరాల శాఖ గొడౌన్ ఇన్‌చార్జ్ ఉద్యోగం ఉందంటూ మోసగిస్తున్నారు. న్యాయం చేయగలరు.

– స్టాలిన్‌బాబు, విద్యానగర్

హాస్టల్లో చేర్పిస్తారని భయంతో కిడ్నాప్ కథ

- ఇంటి నుంచి పారిపోయి వచ్చిన బాలిక
- కిడ్నాప్ కథ అల్లినట్లు అంగీకరించిన బాలిక

కృష్ణలంక(విజయవాడ తూర్పు): తల్లిదండ్రులు హాస్టల్లో చేర్పిస్తారనే భయంతో ఓ బాలిక గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేశారంటూ కట్టుకథ అల్లి సోమవారం కలకలం రేపింది. గుంటూరుకు చెందిన షేక్ మస్తాన్ కార్పెంటర్. ఆయన భార్య ఎల్ఐసీ కార్యాలయంలో పని చేస్తుంది. వీరికి ఒక కుమార్తె (12) ఉంది. గుంటూరులోని గవర్నమెంట్ గరల్స్ హైస్కూల్లో ఐదో తరగతి చదువుతోంది. ఈ క్రమంలో సోమవారం తల్లిదండ్రులు విధుల నిమిత్తం వెళ్లగా బాలిక ఇంటి వద్దనే ఒంటరిగా ఉంది. హాస్టల్లో చేర్పిస్తారనే భయంతో ఇలా కిడ్నాప్ కథ అల్లింది. మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు మాస్క్ ధరించి వారి ఇంటి వద్దకు వెళ్లారు. ‘మీ అమ్మకు యాక్సిడెంట్ అయింది.. నిన్ను తీసుకురమ్మంది’ని బాలికకు చెప్పి కారులో ఎక్కించుకున్నారు. విజయవాడ మీదుగా తీసుకెళ్లే క్రమంలో మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో పండిట్ నెహ్రూ బస్టాండ్ పరిసరాల్లోని ప్రీపెయిడ్ పార్కింగ్‌లో కారు పార్క్ చేశారు. బాలికను కారులో ఒంటరిగా వదిలి ఇద్దరు వ్యక్తులు భోజనం చేసేందుకు హోటల్‌కు వెళ్లారు. అదే అదనుగా బాలిక కారు దిగి తప్పించుకుని బస్టాండ్‌లోకి వెళ్లి ఆర్టీసీ అధికారులకు కిడ్నాప్ విషయాన్ని వివరించింది. వెంటనే అధికారులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు బాలిక నుంచి వివరాలు సేకరించి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. బాలిక ఫిర్యాదుపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బస్టాండ్ పరిసరాల్లోని సీసీ కెమెరా ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలించారు. పార్కింగ్‌లో కారు పార్క్ చేసినట్లు గానీ, కారు దిగి బాలిక బస్టాండ్‌లోకి వెళ్లినట్లు గానీ కనిపించలేదు. వారధి పరిసరాల్లో సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించగా బాలిక ఓ కారు దిగి వచ్చి బౌద్ధ చక్రం వద్ద దిగి అక్కడ నుంచి నడుచుకుంటూ బస్టాండ్‌కు చేరినట్లు కనిపించింది. ఫుటేజీని బాలికకు చూపించి వాస్తవం చెప్పమని పోలీసులు అడిగారు. తనను హాస్టల్‌లో చేరుస్తారనే భయంతో ఇంటి నుంచి పారిపోయి వాహనదారులను లిఫ్ట్ అడిగి విజయవాడ చేరానని తెలిపింది. ఆ తర్వాత కిడ్నాప్ కథ చెప్పానని అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. బాలికను పోలీసులు ఆమె తల్లిదండ్రులకు అప్పగించారు.


తల్లిదండ్రులతో బాలిక

జాతీయ బీచ్ వాలీబాల్ పోటీలకు సువర్ణ ఎంపిక

నూతక్కి(మంగళగిరి): భువనేశ్వర్‌లో ఈ నెల 18నుంచి 20 వరకు జరగనున్న జాతీయ బీచ్ వాలీబాల్ పోటీలకు నగర పరిధిలోని నూతక్కి జిల్లా పరిషత్ స్కూలు విద్యార్థిని నూతక్కి సువర్ణ ఎంపికైంది. గత నెల 27,28వ తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో గుంటూరు జిల్లా కెప్టెన్‌గా అత్యుత్తమ ప్రతిభ కనబరచినట్లు సోమవారం పీడీ కె. రజనీనాయక్ తెలిపారు. రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం సాధించి జాతీయ పోటీలకు ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని సువర్ణను హెచ్ఎం రాజీవ్ రత్న, ఉపాధ్యాయులు అభినందించినట్లు తెలిపారు.



యార్డుకు 57,488 బస్తాల మిర్చి

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 57,488 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 51,264 అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.7,500 నుంచి రూ. 15,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.8,000 నుంచి 16,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం రూ. 8,000 నుంచి రూ. 15,500 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 7,500 నుంచి రూ. 16,000 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.11,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 42,799 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు ఉన్నతశ్రేణి కార్యదర్శి వి.ఆంజనేయులు తెలిపారు.

సీపీఎం జిల్లా నూతన కార్యవర్గం ఎంపిక

లక్ష్మీపురం: గుంటూరులో ఈ నెల 14,15 తేదీల్లో జరిగిన సీపీఎం 25వ జిల్లా మహాసభలో నూతన వర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా వై.నేతాజీ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులుగా పాశం రామారావు, ఎస్.భావన్నారాయణ, ఈమని అప్పారావు, కె.నళినీకాంత్, ఎం.రవి, బూరగ వెంకటేశ్వర్లుతో పాటు మరో 14 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. వివరాలను స్థానిక బ్రాడీపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో జరిగిన పత్రికా సమావేశంలో మహాసభలో చేసిన తీర్మానాలను నేతాజీ తెలియజేశారు. అన్ని వర్గాల ప్రజల శ్రేయస్సుతో పాటు జిల్లా సమగ్రాభివృద్ధి కోసం తీర్మానాన్ని ఆమోదించినట్లు తెలిపారు. ప్రజలపై పెనుభారంగా మారనున్న విద్యుత్ సర్దుబాటు చార్జీలకు వ్యతిరేకంగా గ్రామాలు, వార్డులలో నిరసన కార్యక్రమాలు చేయాలని నిర్ణయించామని తెలిపారు. సమావేశంలో పలువురు సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

న్యాయమూర్తులకు శిక్షణ తరగతులు ప్రారంభం



న్యాయమూర్తులతో సుప్రీంకోర్టు మీడియేషన్, కాన్సిలియేషన్ ప్రాజెక్ట్ కమిటీ

నగరంపాలెం: స్థానిక జిల్లా కోర్టు ఆవరణలోని డీజే కార్యాలయంలో సోమవారం గుంటూరు, ప్రకాశం జిల్లాలోని న్యాయమూర్తులకు మధ్యవర్తిత్వంపై నలభై గంటల శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈనెల 16 నుంచి 20 వరకు జరగనున్న తరగతులకు శిక్షకులుగా సుప్రీంకోర్టు మీడియేషన్, కాన్సిలియేషన్ ప్రాజెక్ట్ కమిటీ నుంచి ఆర్.రత్నతార, సత్యరావు (తమిళనాడు) హాజరై ప్రసంగించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ వై.వి.ఎస్.బి.జి.పార్థసారథి, సంస్థ కార్యదర్శి, సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) టి.లీలావతి పాల్గొన్నారు. రాష్ట్రంలో మధ్యవర్తిత్వం ద్వారా వివాదాలు అనుకున్న స్థాయిలో పరిష్కరించుకోవడంలేదని వక్తలు అన్నారు. అందుకు అనేక న్యాయబద్ధమైన కారణాలు ఉన్నాయని తెలిపారు. మధ్యవర్తిత్వంలో స్థిరాస్తి, వివాహ సంబంధ వివాదాల కన్నా వాణిజ్య పరమైన వివాదాలు ప్రథమ స్థాయిలో పరిష్కరించడం తేలికని చెప్పారు. భవిష్యత్‌లో మధ్యవర్తిత్వం ద్వారా కేసులు పరిష్కరించేందుకు ఎక్కువ ప్రాముఖ్యత ఉంటుందని పేర్కొన్నారు. మధ్యవర్తిత్వ శిక్షణ పొందిన న్యాయమూర్తులు ప్రత్యేక పాత్ర పోషిస్తారని చెప్పారు. ప్రతి న్యాయమూర్తి వారి సంబంధిత న్యాయస్థానంలోని కేసులను పరిష్కరించలేకపోయినా ఇతర కోర్టులోని వాటిని మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించవచ్చని తెలిపారు. న్యాయమూర్తుల అందరూ మధ్యవర్తిత్వంలో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని, సుప్రీమ్‌కోర్టు అంచనాలకు అనుగుణంగా ఇందులో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. తొలి రోజు శిక్షణ తరగతుల్లో గుంటూరు, ప్రకాశం జిల్లాలకు చెందిన సివిల్ జడ్జిలు (జూనియర్, సీనియర్ డివిజన్), జిల్లా జడ్జిలు, అధికారులు పాల్గొన్నారు.

పసుపు రైతులకు న్యాయం చేయకపోతే ధర్నా

తాడేపల్లి రూరల్: దుగ్గిరాల శుభం కోల్డ్ స్టోరేజ్‌లో పసుపు పంటను భద్రపరచి నష్టపోయిన రైతులకు యాజమాన్యం జనవరి 19వ తేదీలోపు నష్టపరిహారం చెల్లించాలని జిల్లా రైతు సంఘం నాయకులు జొన్న శివశంకరరావు డిమాండ్ చేశారు. కోల్డ్ స్టోరేజ్ వద్ద పసుపు రైతులతో కలసి సోమవారం కలిసి ఆయన మాట్లాడారు. అగ్నిప్రమాదం జరిగి 11 నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు నష్టపోయిన రైతులకు పరిహారం అందించలేదని తెలిపారు. లక్షా ఆరు వేల బస్తాలను 300 మందికి పైగా రైతులు గోడౌన్‌లో భద్రపరిచినట్లు చెప్పారు. అగ్ని ప్రమాదానికి గురై అంతా నష్టపోయారన్నారు. ఇప్పటి వరకు యాజమాన్యం గానీ బీమా కంపెనీ వాళ్లు నష్టపరిహారం చెల్లించలేదని తెలిపారు. రైతులకు, కోల్డ్ స్టోరేజ్ యాజమాన్యానికి కుదిరిన ఒప్పందం ప్రకారం 2025 జనవరి 19వ తేదీలోపు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతులతో కలసి పెద్దఎత్తున ధర్నా నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జొన్న శివశంకరరావు

అవయవదానంతో మరణించినా జీవితం

జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణ

గుంటూరు మెడికల్: అవయవదానంతో మనిషి చనిపోయినా వేరొకరి శరీరంలో జీవించవచ్చని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్, అఖిల భారత శరీర అవయవదాతల సంఘం నాయకులు డాక్టర్ యశశ్వి రమణ అన్నారు. గుంటూరు జీజీహెచ్‌లోని శుశృత హాలులో సోమవారం అవయవదానంపై ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా యశశ్వి రమణ మాట్లాడుతూ చాలా మంది మరణించిన అనంతరం కుటుంబ సభ్యులు వారి శరీరాలను కాల్చివేయడం, పూడ్చి వేయడం చేస్తున్నారని పేర్కొన్నారు. ఎంతో మంది దేశ వ్యాప్తంగా తీవ్ర వ్యాధులతో బాధపడుతూ ఆసుపత్రుల్లో శరీర అవయవాల కోసం పడిగాపులు కాస్తున్నట్లు వెల్లడించారు. మూఢ నమ్మకాలతో చనిపోయిన వారిని కాల్చడం, పూడ్చడం చేయకుండా వారి శరీర అవయవాలను దానం చేయడం ద్వారా ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి నూతన జీవితాన్ని ప్రసాదించవచ్చని తెలిపారు. బ్రెయిన్ డెడ్ అయినప్పుడు మాత్రమే చనిపోయిన వారి నుంచి అవయవాలు సేకరిస్తారని, మరణించిన వారి నేత్రాలను సేకరించి అంధులకు చూపు ఇవ్వవచ్చని చెప్పారు. కిడ్నీ, లివర్, హార్ట్, ఇతర శరీర అవయవాలను దానం చేయడం ద్వారా ఆసుపత్రుల్లో తీవ్ర అస్వస్థత ఉన్నవారికి నూతన జీవితాన్ని ప్రసాదించవచ్చని తెలిపారు. ఆసుపత్రిలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరూ అవయవదానంపై అవగాహన కలిగి ఉండాలని ఆయన చెప్పారు. వైద్య సిబ్బందితో అవయవదాన ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో నర్సుల సంఘం నేతలు పద్మజ, హేమలత, ఆషాలత, సునీత, నర్సింగ్ అధికారులు గంగ, విజయ, కిరణ్మయి, నాంచారమ్మ, రమాదేవి, జయలలిత, పద్మ, పలువురు నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



అవయవ దానం ప్రతిజ్ఞ చేయిస్తున్న డాక్టర్ యశశ్వి రమణ

లింగ నిర్ధారణ పరీక్షలు జరిపితే కఠిన చర్యలు

తెనాలి అర్బన్: గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని తెనాలి డెప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ఈరుగుల అన్నపూర్ణ హెచ్చరించారు. తెనాలి డివిజన్ స్థాయి సలహా సంఘ సమావేశాన్ని పాత ప్రభుత్వ వైద్యశాలలోని డెప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతదేశంలో ఆడ భ్రూణ హత్యలను ఆపడానికి ప్రభుత్వం 1994లో గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నిషేధ చట్టాన్ని రూపొందించిందని తెలిపారు. దాని ప్రకారం గర్భం దాల్చిన తరువాత లింగ ఎంపికను ఎవరికీ తెలియజేయకూడదని సూచించారు. గర్భంలో ఆడపిల్ల ఉందని తెలియగానే అనేక మంది భ్రూణ హత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్కానింగ్ సెంటర్ నిర్వాహకులు జాగ్రత్తగా వ్యవహరించాలని ఆమె సూచించారు. స్కానింగ్ సెంటర్లలో రిజిస్ట్రేషన్ పత్రాలు, స్కానింగ్ ధరల వివరాలు, లింగనిర్ధారణ జరపబోమని వెల్లడించే బోర్డులు ఏర్పాటు చేయాలని ఆమె ఆదేశించారు. సమావేశంలో జిల్లా వైద్యశాల వైద్యులు డాక్టర్ మానస, డాక్టర్ సురేష్, డాక్టర్ వినీల్, సీనియర్ ఏపీపీ సునీల్‌కుమార్, రెడ్‌క్రాస్ ప్రతినిధులు భానుమతి, పి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ అన్నపూర్ణ

సంచార ఉచిత వైద్యశాల ప్రారంభం

మంగళగిరి: మండలంలోని నీరుకొండలో మాదల గోవర్ధనరావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంచార ఉచిత వైద్య శిబిరాన్ని సోమవారం రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణ ప్రారంభించారు. ఎన్టీఆర్ ట్రస్ట్, నాట్కో, ఐ ల్యాబ్ ఎపిరాన్ హెల్త్‌కేర్ సహకారంతో 125 మంది రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ కాటూరి వైద్యశాల సహకారంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. అమరావతి మాస్టర్ ప్లాన్ గతంలో చెప్పిన విధంగానే అమలు చేస్తామని, వచ్చే తొమ్మిది నెలల్లో అధికారులు ఇక్కడ ఉండేలా నివాసాలు సిద్ధం చేస్తామని చెప్పారు. నీరుకొండలో ఎన్టీఆర్ భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని, మూడేళ్లలో రాజధాని నిర్మాణం పూర్తి చేస్తామని తెలిపారు. రాజధానిలో రైతుల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ధనేకుల రామారావు, మాదల రాజేంద్ర, మాదల శ్రీనివాసరావు, కాటూరి సుబ్బారావు, టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, కాటూరి మెడికల్ కళాశాల అధినేత సుబ్బారావు, ఏపీ రాస్ ఎండీ మాదల అనిత, రాష్ట్ర సివిల్ సప్లైస్ డైరెక్టర్ తోట పార్థసారథి పాల్గొన్నారు.


సంచార వైద్యశాలను ప్రారంభిస్తున్న మంత్రి నారాయణ

నిరుద్యోగ యువతకు కంప్యూటర్, ట్యాలీ కోర్సుల్లో ఉచిత శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు బెంగుళూరులో కంప్యూటర్, ట్యాలీ నైపుణ్యంపై ఉచిత శిక్షణతో పాటు నూరు శాతం ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధి హరిప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ పాస్, ఫెయిల్ అయిన 18 నుంచి 28 ఏళ్లలోపు వయసు గల అభ్యర్థులకు బెంగుళూరులో 35 రోజుల పాటు ఉచిత భోజన, వసతితో కూడిన శిక్షణ కల్పిస్తామని పేర్కొన్నారు. ట్యాలీ ప్లస్ జీఎస్టీ, స్పోకెన్ ఇంగ్లిషు, కంప్యూటర్, కమ్యూనికేషన్, లైఫ్, ఇంటర్వ్యూ స్కిల్స్‌తో పాటు వర్క్‌ప్లేస్ ఎథిక్స్‌పై అత్యుత్తమ శిక్షణ కల్పిస్తామని వివరించారు. శిక్షణానంతరం వివిధ సంస్థల్లో నెలకు రూ.15వేలకు పైబడిన వేతనంతో నూరు శాతం ఉద్యోగాలను చూపిస్తామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని, ఇతర వివరాలకు 90004 87423 నంబర్లో సంప్రదించాలని ఆయన సూచించారు.

చెరువులో పడి ఫార్మసీ కళాశాల విద్యార్థి మృతి

మేడికొండూరు: ఫార్మసీ కళాశాల విద్యార్థి చెరువులో పడి మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి మండలంలోని జంగంగుంట్ల పాలెం గ్రామ పరిధిలోని కేసీరెడ్డి ఫార్మసీ కళాశాల వద్ద జరిగింది. అమృతలూరు మండలం మూల్పూరు గ్రామానికి చెందిన మూల్పూరి రత్నం, ఝాన్సీ రాణి దంపతులు వ్యవసాయ కూలీలు. వీరి కుమారుడు రంజిత్ కేసీరెడ్డి ఫార్మసీ కళాశాలలో చదువుతున్నాడు. ఆదివారం సెలవు కావడంతో స్నేహితులతో కలిసి కళాశాల క్రీడా మైదానంలో క్రికెట్ ఆడుతున్నాడు. అయితే, కళాశాలలో నీటి కొరత ఏర్పడింది. కళాశాల పక్కనే ఉన్న చెరువులో నీటి మోటర్లు ద్వారా నీటిని సరఫరా చేస్తుంటారు. అవి మరమ్మతుకు గురవడంతో ప్రత్యామ్నాయ మోటార్లు మార్చేందుకు కళాశాల సిబ్బంది గ్రౌండ్‌లో క్రికెట్ ఆడుతున్న రంజిత్‌తో పాటు మరో ముగ్గురు విద్యార్థులను చెరువు దగ్గరకు తీసుకువెళ్లారు. అక్కడ మరమ్మతులు పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి మూల్పూరి రంజిత్(22) చెరువులో పడిపోయాడు. చెరువు బాగా ఊబి కావడంతో బురదలో కూరుకుపోయి అడుగున మృతి చెందాడు. సోమవారం ఉదయం ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగి మృతదేహాన్ని కనుగొని బయటకు తీసుకువచ్చాయి. భద్రత ప్రమాణాలు పాటించని కళాశాల యజమాన్యం నిర్లక్ష్యం వల్లే నిండు ప్రాణం బలైందని ఎమ్మార్పీఎస్ నాయకులు మృతదేహాన్ని గుంటూరు మాచర్ల ప్రధాన రహదారిపై ఉంచి ఆందోళన చేశారు. మృతుని కుటుంబాన్ని ఆదుకుంటామని కళాశాల హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు. మేడికొండూరు సీఐ షేక్ నాగూర్ మీరా సాహెబ్, ఎస్ఐ షేక్ ఖాజీ బాబా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రికి తరలించారు.


రంజిత్ మృతదేహం

పిట్టంబండ మేజరు కాల్వలో యువకుడి మృతదేహం

శావల్యాపురం: మండలంలోని మతుకుమల్లి గ్రామ సమీపంలో పిట్టంబండ ఎన్ఎస్పీ కాలులో యువకుడి మృతదేహం గుర్తించినట్లు ఎస్ఐ లేళ్ళ లోకేశ్వరరావు సోమవారం తెలిపారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వినుకొండ పట్టణం శివారు నాగిరెడ్డిపల్లికు చెందిన దాసరి వంశీ (21) ఐటీఐ చదువుకొని ప్రస్తుతం వినుకొండ హెచ్‌పీ గ్యాస్‌లో డెలీవరి బాయ్‌గా పనిచేస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గ్రామస్తుల సమాచారం, వీఆర్వో ఫిర్యాదు మేరకు ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించామని పేర్కొన్నారు.